సాక్షి
విశాఖపట్నం
సోమవారం । 11 । ఆగస్టు । 2025



ఆసక్తిగా చదరంగం పోటీలు 8లో



కింగ్స్‌పై సన్‌షైనర్స్ ఘన విజయం 8లో



'పరదా' ప్రేక్షకులను ఆకట్టుకుంటుంది 8లో

చిట్‌కెలో నిషేధం ఎత్తివేస్తాం!

- రంగంలోకి చిట్స్ వ్యాపారి
- 22–ఏ జాబితాలోని భూములపై కన్ను
- హైదరాబాద్ కేంద్రంగా వ్యవహారం
- ఇప్పటికే 6 ఎకరాలకుపైగా భూములపై నిషేధం ఎత్తివేత
- ఆయన చేతిలో మరో 15 భూదస్త్రాలు

సాక్షి ప్రతినిధి, విశాఖపట్నం:

అత్యంత విలువైన భూములున్న విశాఖ కేంద్రంగా అధికార పార్టీకి చెందిన నేతలు గద్దల్లా వాలుతున్నారు. ఇప్పటికే ఎండాడలోని విలువైన 5.10 ఎకరాలపై ఉన్న నిషేధాన్ని ఎత్తివేయించుకున్న అధికార పార్టీ నేతలు.. ఇతర భూముల పైనా కన్నేసినట్టు తెలుస్తోంది. ఎలాంటి భూముల నైనా నిషేధం ఎత్తివేయించి.. విక్రయించుకునేందు కువీలుగా చేస్తామంటూ బేరసారాలు సాగిస్తున్నట్టు తెలుస్తోంది. గతంలో విశాఖలో ఏకంగా కోటి రూపాయల మోడల్ చిట్‌ను ప్రారంభించి ఒక వెలుగు వెలిగిన చిట్ కంపెనీకి చెందిన సోదరుడే ఇప్పుడు ఈ భూవ్యవహారాలను చక్కబెట్టేందుకు రంగంలోకి దిగినట్టు ప్రచారం జరుగుతోంది. చిట్ వ్యాపారి మరణించిన తరువాత హైదరాబాద్‌కు వెళ్లిన ఆ వ్యాపారి సోదరుడు అక్కడ నుంచే వ్యవహారాలు సాగిస్తున్నట్టు తెలుస్తోంది. ఇప్పుడు విశాఖలోని పాత నగరంలో ఒక ప్రముఖ హోటల్‌లో తిష్టవేసినట్లు భోగట్టా. ఇందులో భాగంగా ఇప్పటికే మాజీ సైనికులకు చెందిన ఆరు ఎకరాలకుపైగా భూములపై ఉన్న నిషేధాన్ని ఎత్తివేయించి 22–ఏ జాబితా నుంచి తొలగించేలా ఆదేశాలు తెచ్చినట్టు సమాచారం. అయితే, ఈ చిట్ వ్యాపారి వెనుక ఉండి వ్యవహారాలు నడిపిస్తున్న పెద్దలు ఎవరనేది మాత్రం ఇంకా తెలియాల్సి ఉంది.

సచివాలయం వైపు తొంగి చూడొద్దు!

మరోవైపు ఇప్పటికే ఎండాడ భూమి విషయంలో ఆరోపణలు ఎదుర్కొంటున్న ప్రభుత్వ పెద్దలు మరిన్ని భూములను ప్రైవేటు వ్యక్తులకు అప్పగించే కార్యక్రమం మాత్రం యథావిధిగా నడిపిస్తున్నారు. అయితే, దక్షిణ నియోజకవర్గానికి చెందిన నేతపై మాత్రం కూటమి ఎమ్మెల్యేలు లోలోన రగిలిపోతున్నారు. ఈ నేపథ్యంలో సచివాలయంలోని తన పేషీ వైపు మాత్రం కొద్ది రోజులు రావద్దంటూ ఒక అమాత్యుడు సదరు దక్షిణ నియోజకవర్గ నేతకు సూచించినట్టు సమాచారం. ఈ నేపథ్యంలో సదరు నేత కాసింత జోరు తగ్గించినట్టు తెలుస్తోంది. మరోవైపు చిట్ వ్యాపారి తాజాగా దూకుడు పెంచడం చర్చనీయాంశమవుతోంది. అమాత్యుడితో సంబంధం లేకుండా నేరుగా వ్యవహారాలు చక్కబెడుతున్నారు. అయితే, ఈ చిట్ వ్యాపారి వెనుక ఉండి వ్యవహారాలు నడుపుతున్న ప్రభుత్వ పెద్దలు ఎవరనేది మాత్రం తేలాల్సి ఉంది.



సిట్ జాబితాలోని భూముల పైనా కన్ను

వాస్తవానికి విశాఖ నగరంలోని పలు విలువైన భూముల్లో అక్రమాలు జరుగుతున్నాయని 2014–19లో టీడీపీ అధికారంలో ఉన్న సమయంలోనే అప్పటి మంత్రి అయ్యన్న ఆరోపణలు గుప్పించారు. ప్రధానంగా గంటా లక్ష్యంగా ఆయన పలు ఆరోపణలు చేశారు. ఫలితంగా విశాఖ భూ వ్యవహారాలపై తప్పనిసరి పరిస్థితుల్లో అప్పటి సీఎం చంద్రబాబు ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్)ను ఏర్పాటు చేశారు. ఆ సిట్ తన నివేదికను కూడా 2017లో సమర్పించింది. ఈ నివేదికపై ఎటువంటి చర్యలు తీసుకోలేదు. ప్రధానంగా తమ పార్టీకి చెందిన నేతలతో పాటు మద్దతిచ్చే సామాజికవర్గాలకు చెందిన వ్యక్తులు, సంస్థలు ఇందులో ఉండటమే కారణమనే విమర్శలున్నాయి. ప్రధానంగా ఫలానా భూములపై అనేక ఆరోపణలు ఉన్నాయని.. ఈ భూముల జోలికి వెళ్లవద్దనడంతో పాటు ఆ భూములకు నిరంభ్యంతర పత్రాలు (ఎన్‌వోసీ) కూడా జారీ చేయవద్దంటూ స్పష్టమైన ఆదేశాలు జారీచేసింది. అటువంటి భూములకు కూడా ఎన్‌వోసీలు ఇప్పిస్తామంటూ ఇప్పుడు సదరు చిట్ వ్యాపారి రంగంలోకి దిగినట్టు తెలుస్తోంది. ఈ విధంగా ఇప్పటికే సిట్ పరిధిలోకి 6 ఎకరాలకుపైగా భూమికి ఎన్‌వోసీ తెచ్చినట్టు కూడా సమాచారం. అంతేకాకుండా అత్యంత విలువైన ప్రాంతాల్లోని 15 కీలకమైన భూదస్త్రాలు కూడా ఆయన చేతిలో ఉన్నాయి. వీటన్నింటికి ఎన్‌వోసీలు ఇప్పించి.. ప్రభుత్వ భూముల జాబితా నుంచి తొలగించేలా చేస్తానని కూడా చెబుతుండటం గమనార్హం. ఇప్పటికే ఎండాడ భూమి విషయంలో ఆరోపణలు ఎదుర్కొంటున్న ప్రభుత్వ పెద్దలు ఏ మాత్రమూ తగ్గేదేలే అంటూ ముందుకెళుతుండటం గమనార్హం.

న్యూస్‌రీల్

కనకమహాలక్ష్మి సన్నిధిలో హైకోర్టు న్యాయమూర్తి



అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్న హైకోర్టు న్యాయమూర్తి దంపతులు

దాబాగార్డెన్స్: ఉత్తరాంధ్ర కల్పవల్లి కనకమహాలక్ష్మి అమ్మవారిని హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ వై.లక్ష్మణరావు దంపతులు ఆదివారం దర్శించుకున్నారు. ఆలయ సంప్రదాయం ప్రకారం వారికి అధికారులు పూర్ణకుంభ స్వాగతం పలికారు. అనంతరం న్యాయమూర్తి దంపతులు అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. వేద పండితులు వేదాశీర్వచనం చేసి, అమ్మవారి ప్రసాదం అందజేశారు. బీసీ వెల్ఫేర్ సెక్రటరీ ఎస్.సత్యనారాయణ కూడా అమ్మవారిని దర్శించుకున్నారు. ఆలయ ఈవో శోభారాణి, ఏఈవో రాజేంద్రకుమార్ ఏర్పాట్లు పర్యవేక్షించారు.

సెప్టెంబర్ 14న నేషనల్ డాగ్ షో



పోస్టర్ ఆవిష్కరిస్తున్న కెన్నెల్ అసోసియేషన్ సభ్యులు

మద్దిపాలెం: సెప్టెంబర్ 14న నేషనల్ డాగ్ షో నిర్వహిస్తున్నట్లు విశాఖ కెన్నెల్ అసోసియేషన్ కార్యదర్శి కృష్ణ తెలిపారు. ఆర్ అండ్ బీ సమీపంలోని ఒక ఫంక్షన్ హాల్లో ఆదివారం ఈ కార్యక్రమానికి సంబంధించిన పోస్టర్‌ను ఆవిష్కరించారు. కెన్నెల్ క్లబ్ ఆఫ్ ఇండియా సహకారంతో అసోసియేషన్ ఆధ్వర్యంలో ఎంవీపీ గాదిరాజు ప్యాలెస్‌లో ఈ డాగ్ షో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఊటీ, కొడైకెనాల్, ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, ఒడిశా, తమిళనాడు, కోల్‌కతా, జార్ఖండ్, ఛత్తీస్‌గఢ్ వంటి ప్రాంతాల నుంచి 50 జాతులకు చెందిన 300 కుక్కలు ఈ షోలో పాల్గొంటాయని వివరించారు. కార్యక్రమంలో నారాయణరెడ్డి, రాజేశ్వరరావు, సీరట్ల శ్రీనివాస్, సూర్యప్రకాష్ రెడ్డి, కృష్ణప్రసాద్, రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

వాణిజ్య సంస్థల్లో డొమెస్టిక్ సిలిండర్ల వినియోగం

- కేసుల నమోదు



సిబ్బంది స్వాధీనం చేసుకున్న సిలిండర్లు

మహారాణిపేట: వాణిజ్య అవసరాలకు డొమెస్టిక్ ఎల్‌పీజీ సిలిండర్లు వినియోగిస్తున్న పలు సంస్థలపై సివిల్ సప్లైస్ అధికారులు ఆదివారం కూడా దాడులు కొనసాగించారు. జాయింట్ కలెక్టర్ పి.మయూర్ అశోక్ ఆదేశాల మేరకు డీఎస్‌వో వి.భాస్కరరావు పర్యవేక్షణలో నగరంలో రెండు రోజుల నుంచి పలు సంస్థల్లో గ్యాస్ సిలిండర్లను తనిఖీ చేస్తున్నారు. నగర పరిధిలో మూడు ఏఎస్‌వోల పర్యవేక్షణలో చెకింగ్ ఇన్‌స్పెక్టర్లు ఈ దాడుల్లో పాల్గొంటున్నారు. ఇప్పటి వరకు చేపట్టిన తనిఖీల్లో పలు సంస్థల్లో వినియోగిస్తున్న 67 డొమెస్టిక్ సిలిండర్లను గుర్తించి, స్వాధీనం చేసుకున్నట్లు డీఎస్‌వో తెలిపారు. ముందస్తు అనుమతి లేకుండా ఎల్‌పీజీ సిలిండర్లను బహిరంగ ప్రదేశాల్లో వినియోగించడం, నిల్వ చేయడంపై కేసులు నమోదు చేసినట్లు పేర్కొన్నారు.

సమర్థ న్యాయవాదులు అవసరం

సీనియర్ న్యాయమూర్తి జస్టిస్ రాయ్



సత్యనారాయణ చిత్రపటాన్ని ఆవిష్కరిస్తున్న హైకోర్టు సీనియర్ న్యాయమూర్తి జస్టిస్ రాయ్

విశాఖ లీగల్: న్యాయ వ్యవస్థ బలోపేతం కావడానికి సమర్థవంతమైన న్యాయవాదులు అవసరమని గుజరాత్ హైకోర్టు సీనియర్ న్యాయమూర్తి జస్టిస్ చీకటి మానవేంద్రనాథ్ రాయ్ అన్నారు. జిల్లా కోర్టు నూతన భవన సముదాయంలోని సమావేశ మందిరంలో ఆదివారం న్యాయవాదుల సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో దివంగత న్యాయవాది ఎం.సత్యనారాయణ చిత్రపటాన్ని జస్టిస్ రాయ్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సత్యనారాయణ బలహీన వర్గాలకు ఉచిత న్యాయ సహాయం అందించారని గుర్తుచేసుకున్నారు. ఆయన కేసులు వివరించే తీరు, ప్రవర్తన నేటి యువ న్యాయవాదులకు ఆదర్శం కావాలన్నారు. జిల్లా ప్రధాన న్యాయమూర్తి చిన్నంశెట్టి రాజు మాట్లాడుతూ దిగువ స్థాయి నుంచి ఎదిగి, ఎందరో న్యాయవాదులకు సత్యనారాయణ మార్గదర్శకంగా నిలిచారన్నారు. విశాఖ న్యాయవాదుల సంఘం అధ్యక్షుడు ఎం.కె. శ్రీనివాస్ మాట్లాడుతూ కోర్టుల్లో సత్యనారాయణ వ్యవహరించిన తీరు తమకు ఎంతో నేర్పిందని చెప్పారు. రాష్ట్ర బార్ కౌన్సిల్ ఉపాధ్యక్షుడు ఎస్.కృష్ణమోహన్, సభ్యుడు పి.నర్సింగరావు, న్యాయవాదుల సంఘం కార్యదర్శి ఎల్.పి.నాయుడు, పైలా సన్నీబాబు, నమ్మి సన్యాసిరావు, సత్యనారాయణ కుమారుడు, న్యాయవాది అనిల్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

కొనసాగిన అప్పన్న ఆభరణాల తనిఖీ



సింహగిరిపై మ్యూజియంలో ఆభరణాలను పరిశీలిస్తున్న కమిటీ సభ్యులు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి వారికి చెందిన ఆభరణాల తనిఖీ ఆదివారం రెండో రోజు కూడా కొనసాగింది. దేవాదాయ శాఖ రాజమహేంద్రవరం రీజినల్ జాయింట్ కమిషనర్ ఏర్పాటు చేసిన ఐదుగురు సభ్యుల కమిటీ ఈ తనిఖీలను నిర్వహించింది. సింహగిరిపై ఉన్న ఆలయ మ్యూజియంలోని స్వామివారి బంగారు, వెండి ఆభరణాలను, ఇతర వస్తువులను కమిటీ సభ్యులు క్షుణ్ణంగా పరిశీలించారు. రిజిస్టర్లలో ఉన్న వివరాలకు అనుగుణంగా వస్తువులు సరిగ్గా ఉన్నాయో లేదో ఈ బృందం నిర్ధారించింది. ఈ తనిఖీల్లో విజయనగరం డిప్యూటీ కమిషనర్ కె.ఎన్.వి.డి.వి. ప్రసాద్, దేవాదాయ శాఖ జ్యువెలరీ వెరిఫికేషన్ అధికారి పల్లంరాజు, అంతర్వేది దేవస్థానం ఈవో ఎం.కె.టి.ఎన్. ప్రసాద్, తూర్పుగోదావరి జిల్లా డిప్యూటీ ఈవో ఇ.వి.సుబ్బారావు, రాజమహేంద్రవరం రీజినల్ జాయింట్ కమిషనర్ కార్యాలయ సూపరింటెండెంట్ సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు. వారికి దేవస్థానం ఈవో వి.త్రినాథరావు, డిప్యూటీ ఈవో రాధ, ఏఈవో రమణమూర్తి అవసరమైన వివరాలను అందజేశారు.

పింఛన్.. టెన్షన్

దివ్యాంగుల్లో..'రీ వెరిఫికేషన్' ఆందోళన!

పుట్టుకతోనే బుద్ధిమాంద్యం, అంగవైకల్యం, మానసిక వైకల్యం, ఎదుగూబొదుగూ లేని మనుషులు. ఇలాంటి దివ్యాంగుల బాధలు వర్ణనాతీతం. ఒక్కరుగా నడవలేరు. కొందరికి కర్ర ఊతం. ఇంకొందరికి అయినవారో.. మరొకరో సాయం. వీరిని చూస్తే ఎవరికైనా జాలి కలగక తప్పదు. ఎంత బిజీలో ఉన్నా తమ వంతు సాయం చేయాలనిపించక మానదు. అలాంటి వీరిపై కూటమి ప్రభుత్వం కక్ష కట్టింది. సామాజిక పింఛన్లు తీసుకుంటున్న పలు కేటగిరీల్లోని దివ్యాంగులను సదరం సర్టిఫికెట్ల రీ వెరిఫికేషన్ పేరిట పిడుగుపాటుకు గురిచేసింది.

- భారీగా పింఛన్ల ఏరివేతకేనా?
- ప్రత్యేకంగా సదరం క్యాంపుల నిర్వహణ
- మరోసారి దివ్యాంగులకు వైద్య పరీక్షలు
- చిన్న తేడా ఉన్నా పింఛన్ తొలగించాలని ఆదేశాలు



విమ్స్‌లో సదరం సర్టిఫికెట్ల వెరిఫికేషన్ కోసం వచ్చిన దివ్యాంగులు

మహారాణిపేట: కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టాక సదరం సర్టిఫికెట్ల రీ వెరిఫికేషన్ ప్రక్రియతో దివ్యాంగుల్లో అలజడి నెలకొంది. ప్రభుత్వం తమ జీవితాలతో చెలగాటం ఆడుతోందన్న భయాందోళన మొదలయింది. రీ వెరిఫికేషన్‌లో సర్టిఫికెట్ రద్దు చేస్తే, వైకల్య శాతం తగ్గిస్తే.. లాంటి ఆలోచనలు వారిని మరింత ఆదోళనకు గురిచేస్తున్నారు. రీ వెరిఫికేషన్‌కు రాని వారికి తాజాగా పింఛన్ కోత పడింది. ఆరు నెలల నుంచి ఈ ప్రక్రియ సాగుతోంది. అనారోగ్యం, ఇతర కారణాలతో రీ వెరిఫికేషన్‌కు రాలేని వారి పింఛన్లకు ఆ తర్వాతి నెల్లో కోత విధిస్తున్నారు. మొన్న మంచాన పట్టిన వారిని, నిన్న మానసిక వికలాంగులను వదల్లేదు. ఇప్పుడు అంధుల బతుకుల్ని మరింత అంధకారంలోకి నెట్టేందుకు సిద్ధమయ్యారు.

రెండో విడత ఏరివేత

వివిధ కేటగిరీల్లో రూ.6 వేలు నుంచి రూ.15 వేలు పింఛన్ పొందుతున్న దివ్యాంగుల ఏరివేత కార్యక్రమానికి కూటమి సర్కార్ శ్రీకారం చుట్టింది. జిల్లాలో వీరు 21,306 మంది ఉండగా ఇప్పటి వరకు 16,187 మంది రీ వెరిఫికేషన్ పూర్తయింది. ఇంకా 5,119 మందికి రీ వెరిఫికేషన్ చేయాల్సి ఉంది. వీరిలో కొంత మంది వివిధ కారణాల వల్ల రీ వెరిఫికేషన్ కార్యక్రమానికి హాజరు కాలేదు. దీంతో పింఛన్ నిలుపుదల చేశారు. ఎంత మందికి నిలుపుదల జరిగిందన్న విషయాన్ని అధికార యంత్రాంగం గోప్యంగా ఉంచింది.

కూటమి సర్కార్ ప్రగల్భాలు

ఎన్నికలకు ముందు దివ్యాంగుల పింఛన్ పెంపుపై ప్రగల్భాలు పలికిన కూటమి ప్రభుత్వం ఇపుడు లబ్ధిదారుల తగ్గింపు కుట్రకు తెరతీసింది. పింఛన్ల భారాన్ని తగ్గించుకునేందుకు తెలివిగా రీవెరిఫికేషన్ బాట పట్టింది. పరిశీలన చేయించుకోని వారికి తర్వాతి నెల నుంచే పింఛన్ కట్ చేస్తున్నారు. ఇప్పటికే సామాజిక పింఛన్లు తీసుకునే వారి మీద ర్యాండమ్ సర్వే చేసిన సంగతి తెలిసిందే. నెలకు రూ.15 వేలు, రూ.10 వేలు, రూ.8 వేలు, 6 వేలు పింఛను తీసుకున్న మంచానికే పరిమితమైన దివ్యాంగులకు ఇప్పటికే నోటీసులు జారీ చేశారు. వీరికి పరీక్షల నిమిత్తం సంబంధిత ఆస్పత్రులకు రప్పిస్తున్నారు. ఇతర ప్రాంతాల వైద్యులతో పరీక్షలు చేయిస్తున్నారు. దీంతో ఏ సాకు పేరిట తమ జీవనాధారమైన పింఛన్‌కు కోత పెడతారోనని దివ్యాంగుల్లో ఆందోళన నెలకొంది.



వెరిఫికేషన్‌కు వచ్చిన దివ్యాంగులు

మొత్తం దివ్యాంగులు	21,306
ఆర్థోపెడిక్	12,238
అంధులు	2,373
ఈఎన్‌టీ	2,287
మానసిక	4,408
రీ వెరిఫికేషన్ జరిగినవి	16,187
రీ వెరిఫికేషన్ చేయాల్సినవి	5,119
పింఛన్ల నిలుపుదల అంచనా	5-12 శాతం

13న వాలీబాల్ క్రీడాకారుల ఎంపిక

ఆరిలోవ: ప్రపంచ స్కూల్ వాలీబాల్ చాంపియన్‌షిప్ పోటీల కోసం క్రీడాకారులను ఎంపిక చేయనున్నట్లు జిల్లా స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆర్గనైజింగ్ సెక్రటరీ వి.దేముడు తెలిపారు. ఉమ్మడి విశాఖ జిల్లాలోని పాఠశాలల్లో చదువుతున్న అండర్–15 బాలబాలికలను ఈ పోటీలకు ఎంపిక చేయనున్నారు. ఈ నెల 13న జీవీఎంసీ ఉన్నత పాఠశాల, రైల్వే న్యూ కాలనీలో ఉదయం 9 గంటల నుంచి ఎంపిక పోటీలు జరుగుతాయి. ఇక్కడ ఎంపికైన క్రీడాకారులు ఈ నెల 18న విజయవాడలోని పడమట కేబీసీ జడ్పీ బాలుర ఉన్నత పాఠశాలలో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారు. అక్కడ ప్రతిభ చూపిన వారు జాతీయ స్థాయి జట్టుకు అర్హత సాధిస్తారు. ప్రపంచ స్కూల్ గేమ్స్ చాంపియన్‌షిప్ పోటీలు డిసెంబర్ 4 నుంచి 13 వరకు చైనాలోని షాంగ్లోలో జరగనున్నాయి. మరింత సమాచారం కోసం 94929 00200ను సంప్రదించవచ్చు.

సింహగిరిపై రూ.3 కోట్లతో శాశ్వత షెడ్

నిర్మాణానికి విరాళం అందించిన డాక్టర్ ఝాన్సీ లక్ష్మీబాయి



శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే గంటా

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహ స్వామి ఆలయంలో భక్తుల సౌకర్యార్థం రూ.3 కోట్ల వ్యయంతో నిర్మించనున్న శాశ్వత షెడ్‌కు భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు ఆదివారం శంకుస్థాపన చేశారు. విజయవాడకు చెందిన దాత డాక్టర్ బొప్పన ఝాన్సీ లక్ష్మీబాయి(శ్రీ వైభవి ఇన్‌ఫ్రాస్ట్రక్చర్స్) ఈ నిర్మాణానికి విరాళం అందించారు. ఆలయ ఉత్తర రాజగోపురం ఎదుట 30 మీటర్ల పొడవు, 60 మీటర్ల వెడల్పుతో నిర్మించే ఈ టెన్సిల్ మెంబ్రేన్ షెడ్.. భక్తులను ఎండ, వానల నుంచి రక్షించడంతో పాటు వారికి విశ్రాంతి స్థలంగా ఉపయోగపడుతుందని గంటా అన్నారు. ఉత్సవాల సమయంలో తాత్కాలిక షెడ్లతో భక్తులు పడుతున్న ఇబ్బందులకు ఈ నిర్మాణంతో తెర పడుతుందన్నారు. ఈ సందర్భంగా దాతను అభినందించారు. సింహాచలం దేవస్థానానికి త్వరలోనే పాలకమండలిని ఏర్పాటు చేస్తామని గంటా వెల్లడించారు. తిరుమల తరహాలో సింహగిరిపై కూడా దాతల సహకారంతో కాటేజీలు నిర్మించి, వసతి సౌకర్యాలు మెరుగుపరచాలని ముఖ్యమంత్రిని కోరామని, ఆయన సానుకూలంగా స్పందించారని తెలిపారు. కొండపై జీఆర్టీ జ్యూయలర్స్ ఏర్పాటు చేసిన శంఖు చక్ర నామాల పక్కనే ఆ సంస్థ పేరును ప్రదర్శించడంపై గంటా తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. భగవంతుడి నామాల వద్ద కంపెనీ పేరు కనిపించడం సరికాదన్నారు. ఆ పేరును వెంటనే తొలగించాలని, లేనిపక్షంలో మొత్తం నిర్మాణాన్ని తీసివేసి కొత్తగా నామాలను ఏర్పాటు చేయాలని దేవస్థానం అధికారులను ఆదేశించారు. ఈ మేరకు అధికారులు జీఆర్టీ పేరుకు ఉన్న విద్యుత్ సరఫరాను నిలిపివేశారు. కార్యక్రమంలో దేవస్థానం ఈవో వి.త్రినాథరావు, దాత బంధువులు, కార్పొరేటర్ పి.వి.నరసింహం పాల్గొన్నారు.

యువత వ్యసనాలకు బానిసలు కావొద్దు

ఏయూ క్యాంపస్: యువతరం మత్తుపదార్థాలకు బానిసలు కారాదని, ఎయిడ్స్ పట్ల అవగాహన కలిగి ఉండాలంటూ బీచ్‌రోడ్డులో రెడ్ రన్ నిర్వహించారు. రాష్ట్ర ఎయిడ్స్ కంట్రోల్ సొసైటీ ఆధ్వర్యంలో ఇంటర్నేషనల్ యూత్ డే వేడుకల్లో భాగంగా బాల బాలికలకు పరుగు పోటీలు నిర్వహించారు.

కార్యక్రమాన్ని జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ జగదీశ్వరరావు జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యువత ఆరోగ్యకరమైన జీవనం అలవాటు చేసుకోవాలన్నారు. మత్తు పదార్థాలకు, వ్యసనాలకు బానిసలైతే జీవితం నాశనం అవుతుందని హెచ్చరించారు. కార్యక్రమంలో జిల్లా లెప్రసీ, ఎయిడ్స్, టీబీ అధికారి డాక్టర్ రమేష్, జిల్లా క్రీడాధికారి వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు. రన్‌లో పాల్గొన్న వారికి సర్టిఫికెట్లు ప్రదానం చేశారు. బాల బాలికలకు వేర్వేరుగా ప్రథమ స్థానంలో నిలచిన వారికి రూ.10 వేలు, ద్వితీయ స్థానంలో నిలిచిన వారికి రూ.7 వేలు నగదు బహుమతులను అందించారు. జిల్లా స్థాయిలో ఎంపికైన వారు విజయవాడలో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారు.



బాలురలో ప్రథమ స్థానం పొందిన వేదవ్యాస్‌కు, బాలికల్లో ప్రథమ బహుమతి పొందిన దాక్షాయినికి చెక్ అందిస్తున్న అతిథులు

● భారత్ మాతా కీ జై



ఏయూక్యాంపస్: స్వాతంత్య్ర దినోత్సవానికి నగరం సిద్ధమవుతున్న వేళ.. విశాఖ సాగరతీరం దేశభక్తితో పులకించింది. భారత నావికా దళ సిబ్బంది ఆదివారం ఉదయం బీచ్ రోడ్డులో త్రివర్ణ పతాకాలతో భారీ ర్యాలీ నిర్వహించారు. జాతీయ జెండాలు, ప్లకార్డులు పట్టుకుని.. భారత్ మాతా కీ జై అంటూ నినాదాలు చేశారు.

● అదిగదిగో.. అద్దాల అడ్వెంచర్!

కైలాసగిరిపై వీఎంఆర్డీఏ ఆధ్వర్యంలో ఏర్పాటు చేస్తున్న స్కై గ్లాస్ బ్రిడ్జ్ పనులు చురుగ్గా సాగుతున్నాయి. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో ఈ ప్రాజెక్టు పనులకు ప్రణాళికలు సిద్ధం చేశారు. త్వరలోనే ఈ అడ్వెంచర్ పర్యాటకులకు అందుబాటులోకి రానుంది.





● ఆకట్టుకున్న పాట్ పెయింటింగ్

కొమ్మాది: సాగర్‌నగర్ ఇస్కాన్ మందిరంలో ఆదివారం జరిగిన పాట్ పెయింటింగ్ పోటీలు ఉత్సాహంగా సాగాయి. ఈ నెల 16న శ్రీ కృష్ణ జన్మాష్టమి పురస్కరించుకుని ఈ పోటీలు నిర్వహించారు. పోటీల్లో సుమారు 300 మంది విద్యార్థులు పాల్గొన్నారు.

● ఆదివాసీ సంస్కృతికి అద్దం పట్టిన థింసా నృత్యాలు

గిరిజన ఉద్యోగ సంఘాల ఆధ్వర్యంలో ప్రపంచ ఆదివాసీ వారోత్సవాలు ఆదివారం ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా మద్దిలపాలెం తెలుగుతల్లి విగ్రహం వద్ద గిరిజన విద్యార్థులు థింసా నృత్యం చేసి ఆకట్టుకున్నారు. కొంత మంది విద్యార్థులు సంప్రదాయ గిరిజన దుస్తులు . దరించి, లయబద్ధంగా థింసా నృత్యంతో అలరించారు. గిరిజన సంస్కృతి సంప్రదాయాల గొప్పదనాన్ని, వాటి విశిష్టతను చాటి చెప్పారు.



- ఫొటోలు: సాక్షి ఫొటోగ్రాఫర్, విశాఖపట్నం

నిత్య విద్యార్థి.. డిగ్రీల దాహార్తి

- 73 ఏళ్ల వయసులోనూ మెడిసిన్‌లో పీజీ
- రిటైరయ్యాక నాలుగు పీజీ కోర్సుల పూర్తి
- చిత్రలేఖనంలోనూ అందెవేసిన చేయి
- ఆదర్శంగా నిలుస్తున్న డా.జువ్వల నాగేశ్వరరావు


ఫ్లై ఓవర్ కింద నివసించే పేదల ఆరోగ్యంపై ఆరా తీస్తున్న డాక్టర్ నాగేశ్వరరావు (ఫైల్)


కేజీహెచ్ చిత్రపటాన్ని బహూకరిస్తూ.. (ఫైల్)

గాజువాక: ఆయనొక వైద్యుడు. 30 ఏళ్లపాటు వైద్యాధికారిగా పని చేసి రిటైరయ్యారు. ఇంత సీనియారిటీ ఉన్న ఆయన ఎక్కడికెళ్లినా మంచి జీతంతో అవకాశం ఇస్తారు. సొంతంగా క్లినిక్ తెరిచినా.. బాగా సంపాదించుకోవచ్చు. కానీ ఆయన అలా చేయలేదు. 73 ఏళ్ల వయస్సులోనూ విద్యార్థిగా మారారు. రోజూ తరగతులకు వెళ్తున్నారు. రిటైరయ్యాక నాలుగు పీజీ కోర్సులు పూర్తి చేసిన ఆయన ప్రస్తుతం మెడిసిన్‌లో పీజీ చేస్తున్నారు. అగనంపూడి ప్రభుత్వాస్పత్రిలో డీఆర్‌పీ కోసం వచ్చిన ఆయన్ని 'సాక్షి'పలకరించగా ఆసక్తికరమైన తన జీవితానుభవాలను, అభిరుచులను పంచుకున్నారు.

నిత్య విద్యార్థిగా..

డాక్టర్ జువ్వల నాగేశ్వరరావు జీవీఎంసీ ప్రజారోగ్య విభాగం అధికారిగా 2010 జూన్‌లో రిటైరయ్యారు. అందరిలాగే పెన్షన్ తీసుకుని శేష జీవితాన్ని ప్రశాంతంగా గడిపేయాలని అనుకోలేదు. ఇంకా ఉన్నత చదువులు చదవాలని నిర్ణయించుకున్నారు. అప్పట్నుంచి నిత్య విద్యార్థిగా మారారు. నిర్ణయం తీసుకోవడమే అదనుగా ఆంధ్రా యూనివర్సిటీలో ఎంఏ సైకాలజీ పూర్తి చేశారు. అనంతరం ఎంఏ ఫిలాసఫీ, తరువాత ఎంఏ పాలిటిక్స్, ఆ తర్వాత ఏయూలోనే హాస్పిటల్ అడ్మినిస్ట్రేషన్‌లో మూడేళ్ల ఎంబీఏ పూర్తి చేశారు. ప్రస్తుతం ఆంధ్రా మెడికల్ కళాశాలలో డాక్టరేట్ ఇన్ మెడిసిన్(ఎండీ) చదువుతున్నారు. ప్రస్తుతం అగనంపూడి ప్రభుత్వాస్పత్రిలో డిస్ట్రిక్ట్ రెసిడెన్సీ ప్రొగ్రామ్(డీఆర్‌పీ) చేస్తున్నారు.

మెడికల్ కళాశాలల్లో అధ్యాపకుడిగా..

రిటైరైన అనంతరం డాక్టర్ జువ్వల వివిధ ప్రైవేట్ మెడికల్ కళాశాలలకు అధ్యాపకుడిగా బాధ్యతలు నిర్వహించారు. తొలుత మహారాజా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ (మిమ్స్)లోని కమ్యూనిటీ మెడిసిన్‌లో ఫ్యాకల్టీగా పని చేశారు. అనంతరం గాయత్రి వైద్య కళాశాలలో ఆర్ఎంవోగా, కమ్యూనిటీ మెడిసిన్‌లో ఫ్యాకల్టీగా బాధ్యతలు నిర్వహించారు. ఉద్యోగంతో పూర్తిస్థాయిలో సంతృప్తి చెందని ఆయన ఇంకా చదువుకోవాలని నిర్ణయించుకున్నారు. ప్రస్తుతం పీజీ ఫైనలియర్ కొనసాగిస్తున్నారు.

చిత్రలేఖనంలోనూ దిట్ట

అధికారిగా, వైద్యునిగా అందిస్తున్న సేవలతోపాటు డాక్టర్ జువ్వల ఎక్స్‌ట్రా కరిక్యులర్ యాక్టివిటీల్లోనూను ముందుంటారు. వివిధ రకాల బొమ్మలు వేసి, వాటిని ప్రముఖులకు బహూకరించడం చేస్తుంటారు. కేజీహెచ్, డాల్ఫిన్ నోస్, ఓర చూపులు, లవ్‌బర్డ్స్, పలువురు దేశ నాయకులు, సామాజికవేత్తల ఫొటోలు ఆయన కుంచె నుంచి జాలువారాయి. వీటితోపాటు మిత్రులు కలిసినప్పుడు పద్యాలు పాడటం, పాటలు ఆలపించడం ఆయనకున్న మరో విశిష్టత.

వైద్యాధికారిగా 30 ఏళ్లు

డాక్టర్ జువ్వల 30 ఏళ్లపాటు ప్రభుత్వ వైద్యాధికారిగా వివిధ బాధ్యతలు నిర్వహించారు. ఆంధ్రా మెడికల్ కళాశాలలో 1971–78 ఎంబీబీఎస్ బ్యాచ్‌కు చెందిన ఆయన ఆ తర్వాత కోల్‌కతాలోని ఆలిండియా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ హైజీన్ అండ్ పబ్లిక్ హెల్త్‌లో డిప్లొమా ఇన్ పబ్లిక్ హెల్త్(డీపీహెచ్) పూర్తిచేసి విశాఖ మున్సిపల్ కార్పొరేషన్(వీఎంసీ)లో వైద్యాధికారిగా కెరీర్ ప్రారంభించారు. వీఎంసీ డిస్పెన్సరీ మెడికల్ ఆఫీసర్‌గా 1981లో ఉద్యోగంలో చేరిన ఆయన ప్రజారోగ్యంలో ఎనలేని సేవలందించారు. యూకే ఫండింగ్‌తో వీఎంసీలో మురికివాడల అభివృద్ధి ప్రాజెక్టుకు ట్రైనింగ్ అండ్ ఇవాల్యుయేషన్ ఆఫీసర్‌గా పనిచేశారు. 1990లో యూకే, ఫ్రాన్స్‌లో పర్యటించారు. అక్కడ అధ్యయనం ద్వారా కార్పొరేషన్ ఆధ్వర్యంలో ప్రతి ఐదు వేల మందికి ఒక హెల్త్ సెంటర్‌ను ఏర్పాటు చేసేలా కృషి చేశారు. ఫలితంగా కార్పొరేషన్ అధికారులు విశాఖలో 48 హెల్త్ సెంటర్లను ప్రారంభించి 36 మంది వైద్యాధికారులను నియమించారు. వీఎంసీ కాస్తా జీవీఎంసీగా మారాక ఆయన జోన్-2, 4, 5లలో సహాయ ప్రజారోగ్యాధికారిగా పనిచేశారు. చివరికి జీవీఎంసీ చీఫ్ మెడికల్ ఆఫీసర్‌గా పని చేసి రిటైరయ్యారు.

ఉద్యోగానికే రిటైర్మెంట్



రిటైర్మెంట్ అనేది ఉద్యోగానికే. వయస్సుకు కాదు. రిటైరైనప్పటికీ నేను నా క్లినిక్ ద్వారా డబ్బు సంపాదించుకోవచ్చు. కానీ చదుకోవాలనే కోరిక బలంగా ఉండటంతో క్లినిక్‌ను మూసివేశాను. తుది శ్వాస వరకు ఏదో ఒకటి చేస్తూ ఉండాలి. ఆ క్రమంలో చదువును కూడా కొనసాగిస్తూ ఉండాలన్నది నా ధ్యేయం.

– డాక్టర్ జువ్వల నాగేశ్వరరావు

క్లుప్తంగా

దూసుకొచ్చిన సముద్రం


బీచ్ రోడ్డు ప్రధాన రహదారివైపు చొచ్చుకు వస్తున్న కెరటాలు

కొమ్మాది: భీమిలి బీచ్‌రోడ్డు ప్రధాన రహదారిలో రుషికొండ బీచ్ వద్ద ఆదివారం ఉదయం సముద్రపు అలలు ముందుకు దూసుకొచ్చాయి. ఎన్నడూ లేనంతగా అలలు బీచ్ రోడ్డుకు దగ్గరగా రావడంతో తీర ప్రాంతవాసులు కాస్త ఆందోళన చెందారు. సుమారు 7 అడుగుల మేర ముందుకు వచ్చిన అలలు అక్కడ ఉన్న నిర్మాణాలను బలంగా తాకాయి. వాతావరణంలో మార్పులు, పౌర్ణమి కారణంగా ఆటుపోట్లు ఎక్కువగా ఉండటం వల్ల ఇలా జరిగిందని స్థానిక మత్స్యకారులు తెలిపారు.

నేడు కలెక్టరేట్‌లో పీజీఆర్ఎస్

మహారాణిపేట: కలెక్టరేట్‌లో సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్) నిర్వహించనున్నట్లు కలెక్టర్ ఎం.ఎన్. హరేందిర ప్రసాద్ తెలిపారు. ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 2 వరకు అన్ని శాఖల జిల్లా అధికారులు అందుబాటులో ఉంటారని ఆయన పేర్కొన్నారు. ప్రజలు వ్యక్తిగత వివరాలతో పాటు సమస్యలకు సంబంధించిన అర్జీలను సమర్పించాలని సూచించారు. గతంలో అర్జీలు ఇచ్చినవారు వాటి స్లిప్పులను తీసుకురావాలన్నారు. మీ కోసం కాల్ సెంటర్ 1100 సేవలను కూడా ఉపయోగించుకోవచ్చన్నారు. అలాగే https://meekosam.ap.gov.in/ వెబ్‌సైట్‌ను సంప్రదించవచ్చన్నారు.

సముద్రంలో మునిగి ఎలక్ట్రిషియన్ మృతి


అప్పలరెడ్డి(ఫైల్)

భీమునిపట్నం: భీమిలి తీరంలో స్నానానికి దిగిన ఓ ఎలక్ట్రీషియన్ మరణించాడు. తీరానికి సమీపంలోని గొల్లలపాలేనికి చెందిన సరగడ అప్పలరెడ్డి(44) ఎలక్ట్రీషియన్‌గా పని చేస్తున్నాడు, ఇతనికి భార్య అరుణకుమారి, కూతురు హేమశ్రీ(16), కొడుకు మోజెస్(10) ఉన్నారు. ఆదివారం కుటుంబ సభ్యులు, స్నేహితులతో కలిసి లైట్‌హౌస్ సమీపంలో స్నానానికి దిగారు. పెద్ద కెరటం వచ్చి అప్పలరెడ్డిని లాక్కుపోయింది. గమనించిన తీరంలో ఉన్న ఫొటోగ్రాఫర్లు అతన్ని రక్షించి, కొన ఊపిరితో ఉన్న అతన్ని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా, అక్కడ చనిపోయాడు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వీఎంఆర్డీఏ కన్వెన్షన్ సెంటర్ ప్రారంభం


కన్వెన్షన్ సెంటర్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు

కొమ్మాది: జాతీయ రహదారి ఎండాడను ఆనుకుని రూ.9.50 కోట్ల వీఎంఆర్డీఏ నిధులతో నిర్మించిన కన్వెన్షన్ సెంటర్‌ను ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు, వీఎంఆర్డీఏ కమిషనర్ కేఎస్ విశ్వనాథన్‌తో కలిసి ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా గంటా మాట్లాడుతూ ఆధునిక హంగులతో వెయ్యి సిట్టింగ్ సామర్థ్యంతో మధ్యతరగతి ప్రజలకు ఉపయోగకరంగా ఉండేలా కన్వెన్షన్ సెంటర్‌ను అందుబాటులోకి తీసుకొచ్చినట్లు తెలిపారు. అనంతరం భీమిలి నియోజకవర్గంలో సుమారు రూ.21 కోట్ల నిధులతో చేపట్టబోయే పనులకు శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో వీఎంఆర్డీఏ చైర్మన్ ప్రణవ్‌గోపాల్ తదితరులు పాల్గొన్నారు.

'పరదా' ప్రేక్షకులను ఆకట్టుకుంటుంది

విశాఖలో సందడి చేసిన హీరోయిన్ అనుపమ పరమేశ్వరన్

డాబాగార్డెన్స్: అనుపమ పరమేశ్వరన్ ప్రధాన పాత్రలో నటించిన లేటెస్ట్ మూవీ 'పరదా'చిత్ర యూనిట్ విశాఖలో వినూత్న తరహాలో పరదాలతో ప్రమోషన్ చేపట్టారు. సినిమా బండి ఫేమ్ ప్రవీణ్ కాండ్రేగుల దర్శకత్వం వహించిన ఈ సినిమా గురించి హీరోయిన్ అనుపమ పరమేశ్వరన్ ఆదివారం నగరంలోని ఓ హోటల్లో మీడియాతో మాట్లాడారు. ఈ చిత్ర కథ సుబ్బు చుట్టూ తిరుగుతుందని, తన ఊరిలోని కఠినమైన మగవారికి మాత్రమే మద్దతిచ్చే సంప్రదాయాల వల్ల విసిగిపోయిన సుబ్బు, ఓ ధైర్యమైన నిర్ణయం తీసుకుంటుందన్నారు. ఇద్దరు అపరిచితులు(దర్శన రాజేంద్రన్, సంగీత)తో కలిసి చేసే రోడ్ ట్రిప్‌లో కథనం సీరియస్ మలుపు తిరుగుతుందన్నారు. ఇలాంటి ఆద్యంతం ఆసక్తి కలిగించే అంశాలు చిత్రంలో చాలా ఉన్నాయని పేర్కొన్నారు. విశాఖలో ఆర్కే బీచ్ అంటే తనకి ఎంతో ఇష్టమన్నారు. ఇక్కడ తను నటించిన చిత్రాలు ఘన విజయం సాధించాయని, ఆ నమ్మకంతోనే ఈ పరదా చిత్ర ప్రమోషన్ టూర్ కూడా విశాఖ నుంచే ప్రారంభించినట్లు తెలిపారు. దర్శకుడు ప్రవీణ్ కాండ్రేగుల కథ చెప్పగానే ఎంతో ఫ్రెష్‌గా కనిపించిందని, కచ్చితంగా ప్రేక్షకులకు నచ్చుతుందని పేర్కొన్నారు.

దర్శకుడు ప్రవీణ్ కాండ్రేగుల మాట్లాడుతూ ఈ కథ, పాతుకుపోయిన సంప్రదాయాలపై నేరుగా ప్రశ్నలు వేస్తూ, నిజాయితీగా సాగుతుందన్నారు. అనుపమ పరమేశ్వరన్ సుబ్బు పాత్రలో తన కెరీర్‌లోనే బెస్ట్ పెర్ఫార్మెన్స్ ఇచ్చిందన్నారు. మృదుల్ సుజిత్ సేన్ సినిమాటోగ్రఫీ, పల్లె జీవితానికి, హిమాలయాల అందాలకు మధ్య ఉన్న తేడాను అందంగా చూపించిందన్నారు. నిర్మాతలు విజయ్, శ్రీధర్ మాట్లాడుతూ మెగాస్టార్ చిరంజీవి బర్త్ డే రోజున సినిమా రిలీజ్ కాబోతుందని పేర్కొన్నారు.

2 వేల కిలోల వెండితో వినాయకుడు

చవితి ఉత్సవాలకు యూత్ ఐకాన్ అసోసియేషన్ సన్నద్ధం


సమావేశంలో మాట్లాడుతున్న శీరపు కనకరాజు

డాబాగార్డెన్స్: విశాఖ మహానగరంలో యూత్ ఐకాన్ అసోసియేషన్ ఆధ్వర్యంలో 2 వేల కిలోల వెండితో వినాయకమూర్తిని ఏర్పాటు చేయనున్నట్లు అసోసియేషన్ ప్రతినిధి శీరపు కనకరాజు తెలిపారు. ఈ మేరకు నగరంలోని వీజేఎఫ్ ప్రెస్‌క్లబ్‌లో ఆదివారం నిర్వహించిన మీడియా సమావేశంలో వినాయక ఉత్సవాల వివరాలు వెల్లడించారు. ఏటా మాదిరే ఈ ఏడాది కూడా వినాయక చవితి మహోత్సవాలను ఘనంగా నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ ఏడాది బీచ్‌రోడ్డు విశ్వప్రియ ఫంక్షన్ హాల్ వెనుకనున్న ఏపీఐఐసీ గ్రౌండ్‌లో ఈ నెల 27 నుంచి 21 రోజుల పాటు చవితి ఉత్సవాలను నిర్వహిస్తామన్నారు. 14 ఎకరాల గ్రౌండ్‌లో 6 ఎకరాల్లో పార్కింగ్, 2 ఎకరాల్లో ఫ్లవర్ షోతో, దేశంలోనే తొలిసారిగా 2 వేల కిలోల వెండి విగ్రహాన్ని వినూత్న రీతిన విశాఖలో ఏర్పాటు చేయనున్నట్లు వెల్లడించారు. గర్భిణులు, వికలాంగులు, వృద్ధులకు ఉచిత దర్శనం కల్పిస్తామన్నారు. తిరుమల తిరుపతి దేవస్థానం తరహాలో ఆలయ నమూనా సెట్ వేయనున్నామన్నారు. ఇందుకు అవసరమైన అన్ని అనుమతులు పొందినట్లు పేర్కొన్నారు. స్వచ్ఛందంగా సేవా కార్యక్రమాల్లో పాల్గొనాలనుకునే భక్తులు టీటీటీ. డౌఊజీబీఛొ. జ్ఞుట ఛొరుఖల ద్వారా రిజిస్ట్రేషన్ చేసుకోవాలన్నారు. సమావేశంలో అసోసియేషన్ ప్రతినిధులు ఎస్.లక్ష్మణ్, ఎస్.లీలాధర్, బేరి మన్మధరావు, కె.భరత్, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

కంబోడియాలో చిక్కుకున్న ఆంధ్రుల్ని కాపాడండి


సమావేశంలో మాట్లాడుతున్న జేఏసీ ప్రతినిధి, సీఎఫ్‌టీయూఐ జాతీయ అధ్యక్షుడు కనకారావు

డాబాగార్డెన్స్: కంబోడియాలో చిక్కుకున్న ఆంధ్రా కార్మికులను కాపాడాలని సీఎం చంద్రబాబును విశాఖ అఖిలపక్ష కార్మిక సంఘాల జేఏసీ ప్రతినిధులు విజ్ఞప్తి చేశారు. వీరిని మోసగించిన ఏజెంట్ బొంగు మురళీ రెడ్డిని తక్షణం అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. ఈ మేరకు జగదాంబ జంక్షన్ సమీపంలోని సిటు కార్యాలయంలో జేఏసీ ప్రతినిధులు ఆదివారం మీడియాతో మాట్లాడారు. శ్రీకాకుళం జిల్లా సంతబొమ్మాళికి చెందిన ఏజెంట్ మురళీరెడ్డి డేటా ప్రాసెసింగ్ జాబ్‌ల పేరిట మాయమాటలు చెప్పి ఏడుగురి నుంచి చెరో రూ.1.70 లక్షలు తీసుకుని కంబోడియా పంపించారని పేర్కొన్నారు. అక్కడ వారికి ఆ ఉద్యోగాలు ఇవ్వకపోగా, కంబోడియా ఏజెంట్లకు అప్పజెప్పి ఒక్కొక్కరితో మరో మూడు వేల డాలర్లు కట్టించుకున్నారని తెలిపారు. అక్కడి నుంచి వారిని చైనీస్ సైబర్ మోసగాళ్లకు అప్పజెప్పి, వారిచే చట్ట వ్యతిరేక పనులు చేయించడానికి బలవంతం పెట్టారన్నారు. అందుకు అంగీకరించకపోవడంతో చిత్రహింసలకు గురి చేస్తున్నారని తెలిపారు. వీరిలో విశాఖకు చెందిన వారు ఒకరు, శ్రీకాకుళానికి చెందిన నలుగురు, అంబేడ్కర్ కోనసీమ జిల్లాకు చెందిన ఇద్దరు కార్మికులు ఉన్నారని పేర్కొన్నారు. తక్షణమే సంబంధిత మంత్రులు, అధికారులు స్పందించి, వారిని కాపాడి, రాష్ట్రానికి తీసుకురావాలని విజ్ఞప్తి చేశారు. సమావేశంలో జేఏసీ ప్రతినిధులు సీఎఫ్‌టీయూఐ జాతీయ అధ్యక్షుడు ఎస్.కనకారావు, ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి జీఎస్‌జే అచ్యుతరావు, సిటు జిల్లా ఉపాధ్యక్షుడు ఆర్‌కేఎస్‌వీ కుమార్, కుమార మంగళం, పి.మణి, కొండయ్య పాల్గొన్నారు.

అన్నదాతకు కొర్రీలు

- జిల్లాలో 6,499 మంది రైతులకు ఎగనామం
- వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో 25,072 మందికి రైతు భరోసా సాయం
- కూటమి ప్రభుత్వంలో కేవలం 18,573 మందికే సుఖీభవ నిధులు



మహారాణిపేట: పెట్టుబడి సహాయం కోసం ఎదురుచూస్తున్న రైతులపై కూటమి సర్కార్ కత్తికట్టింది. పలు నిబంధనలతో అన్నదాత సుఖీభవ పథకంలో అన్నదాతల సంఖ్యపై కోతలు విధించింది. కొర్రీల మీద కొర్రీలు వేస్తూ అన్నదాతల ఆశలపై నీళ్లు చల్లింది. ఎన్నికల ముందు ఈ పథకం కింద ఏడాదికి రూ.20 వేలు ఇస్తామంటూ టీడీపీ అధినేత చంద్రబాబు హామీలు గుప్పించారు. అధికారంలోకి వచ్చాక తొలి ఏడాదిలోనే హామీని తుంగలోకి తొక్కేశారు. గత ఏడాది ఈ పథకాన్ని అమలు చేయకుండా ఎగ్గొట్టిన కూటమి సర్కార్ ఈ ఏడాది విడుదల చేసిన లబ్ధిదారుల జాబితాలో వేల సంఖ్యలో అర్హులైన రైతుల పేర్లు కనిపించడం లేదు. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో జిల్లాలో 25,072 మందికి రైతు భరోసా నిధులు జమ చేశారు. కూటమి సర్కార్ అన్నదాత సుఖీభవ పథకానికి సంబంధించి 2025–26 ఆర్థిక సంవత్సరంలో 18,573 మంది రైతులను అర్హులుగా ఎంపిక చేసింది. అంటే 6,499 మంది రైతులను అన్నదాత సుఖీభవ పథకానికి దూరం చేసింది.

వెబ్‌ల్యాండ్ సాకుతో..

వెబ్‌ల్యాండ్‌లో పేర్లు ఉన్న రైతులకు మాత్రమే అన్నదాత సుఖీభవ ఇస్తామని ప్రకటించడంలో రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. గతంలో ఎప్పుడు ఎక్కడ లేని నిబంధనలను కూటమి సర్కార్ అమలు చేయడం వల్ల రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కౌలు రైతు, కుటుంబంలో ఒక్క లబ్ధిదారుడు ఎంపిక, పది సెంట్లు లోపు భూమి ఉన్నవారు తొలగింపు, ఆధార్, ఈకేవైసీ, బ్యాంకు ఖాతాలకు అనుసంధానం కాలేదని పలువురు రైతులను తొలగించడం వంటి చర్యలు అధికారులు చేపట్టారు. అనంతరం ఓటీపీ చెప్పాల్సి ఉంటుంది. వీటిపై అవగాహన లేక వేలాది మంది రైతులు వేలి ముద్ర వేయలేదు. ఇటువంటి నిబంధనల వల్ల జిల్లాలో 6,499 మంది రైతులను జాబితా నుంచి తొలగించారు. సర్కార్, అధికారుల నిర్లక్ష్యం కారణంగా వేలాది మంది రైతులు అన్నదాత సుఖీభవకు దూరమయ్యారు.

అప్పులు పాలు అవుతున్న కర్షకులు

పెట్టుబడి సాయం సకాలంలో అందకపోవడంతో రైతులు అప్పులుపాలయ్యారు. ఈ సీజన్‌లో పంటలు వేయడానికి పెట్టుబడి సహాయం కోసం రైతులు ఎదురు చూశారు. పెట్టుబడి సాయం అందక రైతులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ఎక్కువ శాతం రైతులు అధిక వడ్డీలకు అప్పులు తెచ్చి సాగు చేపట్టారు. గత ఏడాది నుంచి వ్యవసాయ భారంగా మారడంతో రైతులు సాగుకు దూరమవుతున్నారు. గత వైఎస్సార్ సీపీ సర్కార్ ఖరీఫ్ సీజన్‌లో సకాలంలో రైతు భరోసా అందించి రైతులను ఆదుకుంది.

కింగ్స్‌పై సన్‌షైనర్స్ ఘన విజయం


తొలి వికెట్‌కు 84 పరుగులు జోడించిన కింగ్స్ ఓపెనర్లు భరత్, అర్జున్ జోడీ

విశాఖ స్పోర్ట్స్: ఆంధ్ర ప్రీమియర్ లీగ్ (ఏపీఎల్) నాలుగో సీజన్‌లో విజయవాడ సన్‌షైనర్స్ జైత్రయాత్ర కొనసాగుతోంది. ఆదివారం జరిగిన మ్యాచ్‌లో కాకినాడ కింగ్స్‌పై 24 పరుగుల తేడాతో విజయం సాధించింది. ఈ గెలుపుతో విజయవాడ వరుసగా రెండో విజయాన్ని నమోదు చేయగా, కాకినాడకు రెండో ఓటమి. నగరంలోని వైఎస్సార్ ఏసీఏ-వీడీసీఏ స్టేడియంలో టాస్ ఓడి తొలుత విజయవాడ బ్యాటింగ్‌కు దిగింది. టాప్ ఆర్డర్ విఫలమైనా, చివరిలో జహీర్ (57 నాటౌట్), తేజ (46 నాటౌట్) అద్భుత బ్యాటింగ్‌తో నిర్ణీత 20 ఓవర్లలో 5 వికెట్లకు 195 పరుగులు చేసింది. కాకినాడ బౌలర్లలో స్పిన్నర్ ఆంజనేయులు మూడు వికెట్లు తీశాడు. అనంతరం 196 పరుగుల లక్ష్యఛేదనలో కాకినాడ కింగ్స్‌కు ఓపెనర్లు అర్జున్ (48), కెప్టెన్ భరత్ (34) తొలి వికెట్‌కు 84 పరుగుల భాగస్వామ్యంతో శుభారంభం అందించారు. వారు ఔటైన తర్వాత కాకినాడ బ్యాటింగ్ ఆర్డర్ పేకమేడలా కూలిపోయింది. రవికిరణ్(31) మినహా మిగతా వారు విఫలం కావడంతో మరో ఐదు బంతులు మిగిలి ఉండగానే 171 పరుగులకు ఆలౌట్ అయింది. విజయవాడ బౌలర్లు పృథ్వీ, టి.భరత్ చెరో మూడు వికెట్లతో కాకినాడ పతనాన్ని శాసించారు.

అదరగొట్టిన కెప్టెన్ హేమంత్

ఏపీఎల్‌లో భాగంగా జరిగిన రెండో మ్యాచ్‌లో భీమవరం బుల్స్ జట్టు రాయలసీమ రాయల్స్‌పై 7 వికెట్ల తేడాతో ఘన విజయం సాధించింది. టాస్ గెలిచి ఫీల్డింగ్ ఎంచుకున్న భీమవరం బుల్స్, రాయలసీమ రాయల్స్‌ను కట్టడి చేసింది. రాయల్స్ కెప్టెన్ రషీద్ (56) అర్ధశతకంతో రాణించినప్పటికీ.. ఆ జట్టు చివర్లో అనూహ్యంగా కుప్పకూలింది. కేవలం 17 పరుగుల వ్యవధిలో చివరి ఆరు వికెట్లను కోల్పోయి, మరో నాలుగు బంతులు మిగిలి ఉండగానే 139 పరుగులకు ఆలౌటైంది. బుల్స్ బౌలర్లలో సత్యనారాయణ మూడు వికెట్లు తీయగా, హరిశంకర్, మనీష్, హేమంత్ తలా రెండు వికెట్లు పడగొట్టారు. అనంతరం 140 పరుగుల విజయలక్ష్యంతో బరిలోకి దిగిన భీమవరం బుల్స్ కెప్టెన్ హేమంత్ అద్భుత ఇన్నింగ్స్‌తో సునాయాసంగా గెలిచింది. హేమంత్ 65 పరుగులు (3 ఫోర్లు, 6 సిక్సర్లు) చేసి జట్టు విజయంలో కీలకపాత్ర పోషించాడు. అతనికి వంశీకృష్ణ (27 నాటౌట్), సూర్యతేజ (23 నాటౌట్) చక్కటి సహకారం అందించడంతో బుల్స్ జట్టు 15.5 ఓవర్లలోనే లక్ష్యాన్ని ఛేదించింది.

పలుమార్లు ఆగిన గుండె.. ఎక్మోతో నిలిచిన ప్రాణం

- విశాఖలో ఎక్మోతో సీపీఆర్ చేసిన కిమ్స్ ఐకాన్ వైద్య బృందం


రోగితోపాటు మీడియా సమావేశంలో మాట్లాడుతున్న వైద్యులు

మహారాణిపేట: గుండె ఉన్నట్టుండి ఆగిపోతే.. అమ్మో ఆ ఊహే భయానకం. కానీ, విశాఖలో ఒక వ్యక్తికి పలుమార్లు గుండె ఆగింది. సమయానికి సరైన ఆస్పత్రిలో ఉండడంతో వైద్యులు ఎక్మో సీపీఆర్ చేసి మరీ అతడి ప్రాణాలు కాపాడారు. నగరంలోని కిమ్స్ ఐకాన్ ఆస్పత్రికి చెందిన పలువురు వైద్యులు సంయుక్తంగా చేసిన కృషితో అతడి ప్రాణం నిలిచింది. రోగి కోలుకోవడంతో ఆదివారం మీడియాకు ముందుకు తీసుకొచ్చి, చికిత్స వివరాలు వెల్లడించారు.

నగరంలోని అగనంపూడి ప్రాంతానికి చెందిన లక్ష్మణకుమార్ పాండా(31) ఓ ఫార్మా కంపెనీ ఉద్యోగి. అక్కడ ఆయన ప్రమాదవశాత్తు ఐసోబ్యుటైల్ నైట్రేట్ అనే విషపూరిత వాయువును పీల్చేశారు. ఫలితంగా శరీరంలోని భాగాలకు ఆక్సిజన్ సరఫరా ఆగిపోయి.. శరీరమంతా నీలిరంగులోకి మారిపోయింది. వెంటనే అతడిని కిమ్స్ ఐకాన్ ఆస్పత్రికి తరలించారు. కొద్దిసేపటికే కార్డియాక్ అరెస్ట్ అయింది. సీపీఆర్ చేస్తున్నా కూడా పదే పదే గుండె ఆగిపోసాగింది. దీంతో ఆస్పత్రికి చెందిన ఎక్మో నిపుణుడు డాక్టర్ ఎం.రవికృష్ణ ఆధ్వర్యంలో వైద్యులు సాయి మణికందన్, రవి కన్నా కలిసి అతడికి ఎక్మో సాయంతో సీపీఆర్ చేయాలని నిర్ణయించారు. ఈ ప్రక్రియ ఏపీలో ఇంతవరకూ ఎవరికీ చేయలేదు. అయితే రోగికి క్షణక్షణం దిగజారుతున్న పరిస్థితిని దృష్టిలో పెట్టుకుని ఇలా చేయాలని తీసుకున్న నిర్ణయం సత్ఫలితాలనిచ్చింది. మూడు రోజుల పాటు ఎక్మో మీద ఉంచిన తర్వాత అతడు క్రమంగా కోలుకున్నాడు.

మళ్లీ లేచి తిరుగుతాననుకోలేదు : "ఆరోజు ఏం జరిగిందో తెలిసేలోపే స్పృహ తప్పింది. మావాళ్లు నన్ను వెంటనే కిమ్స్ ఐకాన్ ఆస్పత్రికి తీసుకొచ్చి, ఎమర్జెన్సీ వార్డులో చేర్చారు. తర్వాత నా గుండె పదే పదే ఆగిపోయిందట. నేను అసలు లేచి మళ్లీ మనుషుల మధ్య మామూలుగా తిరుగుతానని అనుకోలేదు. డాక్టర్లు నా ప్రాణాలు నిలబెట్టారని తెలిసింది. వారికి, సిబ్బందికి, యాజమాన్యానికి కృతజ్ఞతలు"అని లక్ష్మణకుమార్ పాండా చెప్పారు.

ఆసక్తిగా చదరంగం పోటీలు

విశాఖ స్పోర్ట్స్: ఆల్ విశాఖ చదరంగం సంఘం ఆధ్వర్యంలో శ్రీ చాణిక్య డిగ్రీ కళాశాలలో ఆదివారం నిర్వహించిన జిల్లా స్థాయి చదరంగం పోటీల్లో పి.కృష్ణవరణ్య, ఎస్.చంద్రశేఖర్ విజేతలుగా నిలిచారు. రాపిడ్ విభాగంలో మొత్తం ఏడు రౌండ్లు జరిగాయి. ఈ రౌండ్లన్నిటిలోనూ అద్భుతమైన ప్రదర్శన కనబరిచి పి.కృష్ణవరణ్య విజేతగా నిలిచాడు. ఈ విభాగంలో 98 మంది క్రీడాకారులు పోటీపడ్డారు. ఆరేసి పాయింట్లతో చంద్రశేఖర్, తనీష్, శైలేంద్ర ద్వితీయ స్థానంలో నిలవగా, ఐదున్నర పాయింట్లతో ఈశా, సందీప్‌లు తృతీయ స్థానంలో నిలిచారు. బ్లిజ్ విభాగంలోనూ ఏడు రౌండ్ల పాటు హోరాహోరీగా పోటీ జరిగింది. ఆరున్నర పాయింట్లతో ఎస్.చంద్రశేఖర్ విజేతగా నిలిచాడు. ఈ విభాగంలో 93 మంది పాల్గొన్నారు. ఆరు పాయింట్లతో ప్రశాంత్, తనీష్, కృష్ణ, వీర్రాజు ద్వితీయ స్థానాన్ని పంచుకున్నారు. ఐదున్నర పాయింట్లతో యుగేష్, వి. కుమార్ మూడవ స్థానంలో నిలిచారు. ఈ రెండు విభాగాల్లోనూ మొదటి రెండు స్థానాల్లో నిలిచిన విజేతలను నంద్యాలలో జరగనున్న అంతర్ జిల్లాల పోటీలకు పంపనున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

సండే.. 'సీ'న్ అదిరే!

జన సముద్రంలా ఆర్‌కే బీచ్




రయ్‌న దూసుకెళ్తూ.. ఎంజాయ్ చేద్దాం


కాపులుప్పాడ బీచ్: మంద కోసం వెళ్తున్న గొర్రెలు

సాగరతీరం ఆదివారం కిటకిటలాడింది. ఆర్.కె.బీచ్, భీమిలి, యారాడ, సాగర్‌నగర్ తదితర బీచ్‌లు సందర్శకులు, పర్యాటకులతో నిండిపోయాయి. రుషికొండ బీచ్‌లో స్పీడ్ బోట్లపై రయ్ రయ్ అంటూ దూసుకుపోయారు. కుటుంబసభ్యులతో వచ్చిన సందర్శకులు సముద్రంలో స్నానాలు చేస్తూ ఎంజాయ్ చేశారు.

– ఫొటోలు: సాక్షి ఫొటోగ్రాఫర్, విశాఖపట్నం